క్లుప్తంగా

పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

పిట్టలవానిపాలెం: మండలంలోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి చిర్రావుల సత్యానంద్ తెలిపారు. బుధవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీపై అందించనున్న పచ్చి రొట్ట విత్తనాలు (జనుము, జీలుగ, పిల్లిపెసర) రైతు భరోసా కేంద్రాలలో ఉన్నాయని తెలిపారు. అవసరమైన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, అడంగల్, ఆధార్‌కార్డు జిరాక్సులతో రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

స్పందన అర్జీపై విచారణ



పిట్టలవానిపాలెం: మండలంలోని అల్లూరు శివారు నత్తలవారిపాలెం గ్రామానికి చెందిన బడుగు భాస్కర్‌రావు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో రెవెన్యూకు సంబంధించిన అర్జీని అందజేశారు. ఈవిషయంపై కమ్యూనిటీ సర్వేయర్ మదన్, గ్రామ సర్వేయర్‌లు బుధవారం విచారణ చేపట్టేందుకు నత్తలవారిపాలెం గ్రామానికి వచ్చారు. ఈసందర్భంగా అర్జీదారునితో మాట్లాడారు. సమస్యను పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వీఆర్‌ఓ అలపర్తి వెంకటసుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

సెబ్ సీఐ ఎస్. శ్రీనివాసరావు



బాపట్లటౌన్: అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సెబ్ సీఐ ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని దరివాదకొత్తపాలెం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్న మున్నం మహేష్, అక్కల జగదీష్‌లను అదుపులోకి తీసుకొని రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. సెబ్ సీఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాక్టర్లు సీజ్ చేసిన వారిలో సెబ్ ఎస్ఐ ప్రభుదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ద్రావణంపై అవగాహన

భట్టిప్రోలు: వేసవి దృష్ట్యా చిన్నారులు వ్యాధుల బారిన పడకుండా ఓఆర్ఎస్ ద్రావణం అందించేందుకు భట్టిప్రోలు పీహెచ్‌సీ పరిధిలోని జెండా చెట్టు వద్ద బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, గర్భిణులకు వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓఆర్ఎస్ ద్రావణం కలుపుకొనే విధానాన్ని వివరించారు. అతిసారతో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు ఉచితంగా అందజేస్తుందన్నారు. ఏఎన్ఎం సీహెచ్ రత్నకుమారి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.లీలాకుమారి, పి.కలిమిలా రాణి, ఆర్.జె. సునీత పాల్గొన్నారు.

జ్యోత్స్నకు విశిష్ట సేవాభూషణ్ పురస్కారం



పల్లెకోన(భట్టిప్రోలు): సమాజ సేవే పరమావధిగా పని చేస్తూ అనాథలు, అభాగ్యులు, అన్నార్తులను ఆదుకుంటూ విశిష్ట సేవలు అందిస్తున్న భట్టిప్రోలు మండలం పల్లెకోనకు చెందిన గ్రేస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కైతేపల్లి జ్యోత్స్న జాతీయ సామాజిక విశిష్ట సేవాభూషణ్ అవార్డును అందుకోనున్నారు. ఈ మేరకు లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా నిర్వాహకులు బుధవారం ఆమెకు సమాచారం అందించారు. ఈ నెల 17వ తేదీన బాపట్ల ఎన్జీఓ హోమ్‌లో జరిగే జాతీయ పురస్కార వేడుకల్లో జ్యోత్స్న ఈ అవార్డును అందుకోనున్నారు.

అంగన్‌వాడీ పిలుస్తోంది ర్యాలీ

తాడికొండ: మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ తాడికొండ సెక్టార్ సూపర్ వైజర్ కె.కృష్ణకుమారి అన్నారు. మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తాడికొండ-1 అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చిన్నారులను కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్ వాడీ పాఠశాలకు పంపించడం వలన కలిగే ప్రయోజనాలను వివరించి చిన్నారుల భవితకు బంగారు బాటలు వేయడంలో అంగన్‌వాడీల పాత్రను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ ఎంవీ సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు మరింత చేరువ

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- పొన్నపల్లిలో సచివాలయ భవనం ప్రారంభం



నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. మండలంలోని పొన్నపల్లి గ్రామంలో రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సచివాలయ భవన సముదాయాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ సేవలను పొందాలంటే మండల కేంద్రాలకు వెళ్లి, రోజులు తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిని మారుస్తూ గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చే విధంగా సచివాలయ వ్యవస్థ రూపొందించటం జరిగిందన్నారు. ప్రభుత్వ సేవలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకు తీసువెళ్లే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. అదే విధంగా తూర్పుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌లో రూ.10 లక్షల ఎంపీ నిధులతో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పైనం ఏడుకొండలరెడ్డి, సర్పంచ్‌లు పైనం బసవపున్నమ్మ, తూము రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కార్యాలయం ప్రారంభం..



కార్యాలయం ప్రారంభించి మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి నాయకులు కృషి చేయాలని పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని ఆరుంబాక పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కన నూతనంగా నిర్మించిన వైఎస్సార్ సీపీ మండల నూతన కార్యాలయాన్ని ఎంపీ మోపిదేవి బుధవారం ప్రారంభించారు. తొలుత కార్యాలయంలో ఏర్పాటు చేసిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ పార్టీ కార్యకలాపాల గురించి నాయకులతో కలసి చర్చించుకునేందుకు కార్యాలయం చక్కని వేదిక అవుతుందన్నారు. జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చీరాల ప్రసాద్ రెడ్డి, వైస్ ఎంపీపీ పైనం రంగారెడ్డి, కామినేని కోటేశ్వరరావు, దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి, మరివాడ ప్రసాద్, చెన్ను కోటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత ...

నగరం: ఎక్కడ దేవుడు పూజింపబడతారో ఆప్రాంతం సుఖ సంతోషాలతో వర్ధిల్లుతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు.మండలంలోని ఈదుపల్లి రెడ్లపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో బుధవారం ఎంపీ మోపిదేవి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. తొలుత వేదపండితులు ఎంపీ మోపిదేవికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మోపిదేవి ఆలయ అభివృద్ధికి రూ 50వేలు విరాళంగా ఆలయకమిటీ సభ్యులకు అందజేశారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, సర్పంచ్ చింతల పవన్‌కుమార్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నీచ ఆలోచనలు కలిగిన వ్యక్తి చంద్రబాబు

- రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికి ఏనాడు చొరవ చూపని చంద్రబాబు
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

చెరుకుపల్లి: నీచ ఆలోచనలు కలిగిన వ్యక్తి ప్రతిపక్షనేతగా ఉండటం దురదృష్టకరమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు మండిపడ్డారు. మండలంలోని పొన్నపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు దేశ ప్రధానులను మార్చే శక్తిగా ఎల్లోమీడియా చూపిస్తున్న తీరు హేయమన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను ఏనాడు కాపాడే విధంగా ప్రవర్తించని చంద్రబాబు నేడు రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేస్తున్నట్లు చెప్పుకోవడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై అక్కసుతో విషం చిమ్మటం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్లి వస్తే పాలకపక్షానికి వణుకు పుడుతుందని ఎల్లోమీడియా కథనాలు వల్లించటం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్లినా, నారావారిపల్లె వెళ్లి వచ్చినా ఇక్కడ ప్రజలు గానీ, పాలక పక్షం గానీ ఆలోచించే పరిస్థితుల్లో లేరని గ్రహిస్తే బాగుంటుందని హితవు పలికారు.

పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేసే దిశగా చర్యలు..

రాష్ట్రాన్ని సస్యశామలంగా తీర్చిదిద్దే దిశగా నాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తలపెట్టిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తిచేసి రాష్ట్రాన్ని సస్యశామలం చేసే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసి పంట భూములకు నీరు అందించేందుకు పనులను వేగవంతం చేస్తున్నారన్నారు. బాపట్ల జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

కొల్లూరు: వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నీలో జట్ల నడుమ పోటాపోటీగా మ్యాచ్‌లు జరుగుతున్నాయి. వేమూరు నియోజకవర్గ స్థాయిలో కొల్లూరు బాలురు, బాలురోన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న పోటీలలో బుధవారం నాలుగు మ్యాచ్‌లు జరగగా, కొల్లూరు-వెల్లటూరు జట్ల నడుమ జరిగిన ఓ మ్యాచ్ అనివార్య కారణాల కారణంగా నిలిచిపోయినట్లు నిర్వాహకులు తెలిపారు. మిగిలిన మ్యాచ్‌లలో భట్టిప్రోలు ఆర్‌సీటీ జట్టుపై పెసర్లంక సీసీ జట్టు గెలుపొందగా, చింతమోటు జట్టుపై ఇంటూరు అంబేడ్కర్ జూనియర్స్ జట్టు విజయం సాధించగా, ఈపూరులంక అంబేడ్కర్ యూత్ జట్టుపై తలపడిన యడ్లపల్లి జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాచ్ ఫలితం తేలకుండా నిలిచిపోయిన మ్యాచ్‌లో వెల్లటూరు పవర్ 11 జట్టు తరపున ఆడిన బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్‌నాగ్ బ్యాటింగ్ చేసి రాణించారు. పోటీలలో రాణించిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షీల్డ్‌లతోపాటు, ఓడిన జట్లకు క్రికెట్ బ్యాట్‌లను నిర్వాహకులు అందజేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం...

ఏట్రవారిపాలెం(కర్లపాలెం): క్రీడలు మానసిక శారీరక ధృడత్వానికి దోహదపడతాయని వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు, బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి తెలిపారు. ఏట్రవారిపాలెం గ్రామంలో యువకుల ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంటును బుధవారం సీతారామిరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిగా ఆడి విజయం సాధించాలన్నారు. కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు మోపర్తి జాన్, అధ్యాపకుడు కత్తి అంకినీడు, స్టీవ్ కొలిన్స్, కమిటీ సభ్యులు మునగాల అయ్యప్పరెడ్డి, గోపిరెడ్డి, బ్రహ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

లోన్ యాప్స్‌పై అప్రమత్తత అవసరం

బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి

కర్లపాలెం: లోన్ యాప్స్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఎంవీరాజుపాలెంలో బుధవారం రాత్రి ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుని ఇబ్బందులు పడవద్దని చెప్పారు. కొందరు మోసగాళ్లు బ్యాంకు అధికారులమని ఫోన్‌చేసి ఓటీపీ చెప్పాలని అడిగితే వారి మాటలు నమ్మి ఓటీపీ చెప్పవద్దని ప్రజలకు సూచించారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామస్తులు తమ ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు స్థానిక మహిళా పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎస్ఐ ఎం.శివయ్య సిబ్బంది పాల్గొన్నారు.

వివిధ రంగాల ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలు



క్రికెట్ కోచ్ మాలిక్‌ను సత్కరిస్తున్న డీఎల్ కాంతారావు, ఇతర ప్రముఖులు

తెనాలి: పట్టణానికి చెందిన అమరావతి మహిళా సహకార సొసైటీ, 'పోస్ట్' స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విభిన్న రంగాల్లోని ప్రతిభావంతులను సత్కరించారు. ముఖ్యఅతిథిగా ఇస్రో పూర్వ శాస్త్రవేత్త, బీజేపీ నేత డాక్టర్ చందు సాంబశివరావు హాజరయ్యారు. సమాజానికి మంచి చేసిన వ్యక్తులను, సేవలు చేసిన ప్రముఖులను సత్కరించటం మంచి సంప్రదాయంగా ఆయన చెప్పారు. కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు మాట్లాడుతూ సమాజం మనకు ఏమిచ్చిందని కాకుండా తోటివారికి మనమేం చేశామనే కోణంలో సానుకూలంగా ఆలోచించాలని సూచించారు. న్యాయవాది హరిదాసు గౌరీశంకర్, తన్నీరు నాగమమల్లేశ్వరి దేవి, తన్నీరు కళ్యాణ్‌కుమార్ మాట్లాడారు. సభలో అంతర్జాతీయ అంతరిక్ష అభివృద్ధి సమావేశానికి హాజరై వచ్చిన విద్యార్థిని గాదిశెటి మోహన లక్ష్మీప్రియాంక, క్రికెట్ కోచ్ షేక్ కరిముల్లా మాలిక్, అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య, శరీరసౌష్టవ పోటీల విజేత తన్నీరు లక్ష్మణ్, యువ చార్టర్డ్ అకౌంటెంట్ జొన్నాదుల భార్గవ్, మానవతావాది సూదా పిచ్చయ్య, ఉత్తమ విద్యార్థిని తన్నీరు మానసబిందులను సత్కరించారు. 'పోస్ట్' సంస్థ చైర్మన్ తన్నీరు శ్రీనివాసబాబు స్వాగతం పలికారు.

శాస్త్రీయంగా వరి విత్తుకుంటే పంటకు ఆరోగ్యం

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారి



వరి విత్తడంపై సిబ్బందికి శిక్షణనిస్తున్న రాజకుమారి

దావులూరు(తెనాలి): ఖరీఫ్ సీజనుకు ముందుగా 30 రకాల విత్తనాలను పచ్చిరొట్టగా వేసుకుని, వచ్చిన పంటలను కలిపి దున్నకుండా, కోసి పశువులకు మేతగా వినియోగించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారి సూచించారు. కొల్లిపర మండల గ్రామం దావులూరులో అభ్యుదయ రైతు గొట్టిముక్కల శ్రీధర్ పంట పొలంలో బుధవారం ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్‌ను 30 రకాల విత్తనాలతో ప్రారంభించారు. అంతరం నేలను దున్నకుండా వరి విత్తుకోవటంపై రాజకుమారి మండల సిబ్బందికి శిక్షణనిచ్చారు. పచ్చిరొట్ట పైరును కోశాక, నేలను దున్నకుండా తాడు సాయంతో వరి విత్తనాలను మొక్కకు మొక్కకు మధ్య ఒక అడుగు, వరుస వరుసకు రెండు అడుగుల దూరంతో విత్తుకోవాలని సూచించారు. దీనివల్ల పైరుకు గాలి, నీరు సమపాళ్లలో అందుతుందనీ, చీడపీడల బెడద తప్పుతుందని చెప్పారు. రైతు శ్రీధర్ మాట్లాడుతూ గతేడాది కూడా ఇదే పద్ధతిలో వ్యవసాయం చేయటంవల్ల భూమి సారవంతమైనట్టు చెప్పారు. వరి పంటలో ఎలాంటి ఎరువులు, పురుగుమందులు వాడకుండానే మంచి దిగుబడులు వచ్చాయని తెలియజేశారు. రెండో పంటగా వేసిన మొక్కజొన్న కూడా మంచి దిగుబడి రావటంతోపాటు, ఐటీసీ ద్వారా రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష చేయించగా, రసాయన రహితమని నివేదిక కూడా వచ్చిందన్నారు. కార్యక్రమంలో కొల్లిపర మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ ఫార్మశీ కాలేజీకి ఐఎస్ఓ సర్టిఫికెట్



ప్రిన్సిపాల్ వెంకటరమణకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఐఎస్ఓ బృందం

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మశీ కాలేజిని బుధవారం ఐఎస్ఓ బృందం తనిఖీ చేసింది. ఐఎస్ఓ రెన్యువల్ తనిఖీలో భాగంగా వచ్చిన బృందం పరీక్షల ఫలితాలు, లైబ్రరీ, లేబొరేటరీ, తరగతి గదులు, డిజిటల్ తరగతి గదులు పరిశీలించి, ఐఎస్ఓ 9001-2015 సర్టిఫికెట్‌ను ఐఎస్ఓ ఇన్‌స్పెక్టర్ కె.కుటుంబరావు, ఎ.సింగయ్యలు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణకు అందజేశారు. కాలేజీకి ఇప్పటికే పీసీఐ, గవర్నమెంట్ ఆఫ్ ఏపీ, యూజీసీ 2ఎఫ్, 12(బి) అఫిలియేషన్ టు ఏఎన్‌యూ, పర్మినెంట్ అఫిలియేషన్ టు బీఫార్మశీ గుర్తింపు ఉందని డాక్టర్ వెంకటరమణ తెలియజేశారు. ఐఎస్ఓ తాజా గుర్తింపు 2024 వరకు వర్తిస్తుందని చెప్పారు. తనిఖీలో కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.సాయిరాజేష్, కె.కళ్యాణ్ చక్రవర్తి, సీహెచ్ నాగశైలజ, డాక్టర్ టి.లక్ష్మీదుర్గ, ఎ.సోనీప్రియాంక పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన పాదిలి వెంకటేశ్వర్లు(63) ఈ నెల 5వ తేదీ సాయంత్రం తన భార్యతో కలసి మోపెడ్‌పై తెనాలి మండలం కంచర్లపాలెం వస్తుండగా గుంటూరు-నందివెలుగు రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఘటనలో వెంకటేశ్వర్లు తీవ్ర గాయాలపాలయ్యాడు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

భట్టిప్రోలు: వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్-3లో భాగంగా భట్టిప్రోలు పీహెచ్‌సీ పరిధిలోని స్థానిక రైతుభరోసా కేంద్రం ఆవరణలో బుధవారం 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పారా మెడికల్ ఆప్తాలమిక్ అసిస్టెంట్ (పీఎంఓఏ) పెనుమాల అరుణరాణి 60 మందికి పరీక్షించారు. 30 మందికి కళ్లజోళ్లు అవసరం కాగా, ముగ్గుర్ని రిఫరల్‌కు పంపడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'జనరిక్' షాపు భవనానికి భూమి పూజ



బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ భవనంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న జనరిక్ మెడిసిన్ షాపు నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి గుండ్రెడ్డి శివ, రెడ్ క్రాస్ చైర్మన్ నారాయణ భట్టు, బాపట్ల పట్టణ, రూరల్ సీఐలు కృష్ణయ్య, వేణుగోపాల్ రెడ్డి, ఎస్ఐ సింగయ్య పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్



తెనాలిరూరల్: నిబంధనలను అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేస్తామని తెనాలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు హెచ్చరించారు. తెనాలి ఎంవీఐ కార్యాలయ పరిధిలో వివిధ చోట్ల బుధవారం వాహన తనిఖీలు చేశారు. గూడ్స్ వాహనాలను ప్రజా రవాణాకు వినియోగించకూడదని స్పష్టం చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో, ఇతర వాహనాల్లో ఎక్కించుకోకూడదన్నారు. నిబంధనలు పాటించని వాహనాలను గుర్తించి డ్రైవర్లు/యజమానులు, ప్రయాణికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి నిబంధనలు అతిక్రమించి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ట



ఫిరంగిపురం: మండలంలోని హౌస్ గణేష్‌నిపాడులోని చెరువుకొండవద్ద వినాయకుడి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. కొండవీడు రెడ్డిరాజుల ఆస్థాన విద్వాంసుడు శ్రీనాథుడు ప్రతిష్ఠించి పూజించిన విగ్రహం ఇటీవల గుర్తు తెలియని దుండుగుల చేతిలో ధ్వంసం కావడంతో హౌస్ గణేషునిపాడు, మరియు కొత్తపాలెం గ్రామస్తుల సహకారంతో 11 అడుగుల నూతన గణేషుని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం మూడురోజులుగా వేదపండితులు నిర్వహిస్తున్నారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాట ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమాలను పరుచూరి మాధవాచార్యులు, నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ పర్యవేక్షించారు.

విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదం

డీఎస్పీ గోలి లక్ష్మయ్య



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

బాపట్ల అర్బన్: జాతీయ నాయకులు జీవిత చరిత్రలు, నీతి కథల పుస్తకాలు చదివి సందేశాన్ని అర్థం చేసుకొని జీవితంలో గొప్పవారిగా ఎదగాలని డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. బాపట్ల శాఖ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన సమ్మర్ క్యాంపునకు డీఎస్పీ గోలి లక్ష్మయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు గ్రంథాలయాధికారి ఎ.శివాజీ గణేషన్ అధ్యక్షత వహించారు. గోలి లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు తమ ఖాళీ సమయాల్లో విజ్ఞానాన్ని సంపాదించుకునేలా గ్రంథాలయాలు సహాయ పడతాయన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. డాక్టర్ పి.సి.సాయిబాబా, మురళి వరప్రసాద్, సుభాషిని, చిత్రకారుడు జి.వెంకటేశ్వర్లు, ఎం.మల్లికార్జునరావు, మానం శ్రీనివాసరావు, ఎం.నరసింహారావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

19న కలెక్టరేట్ ఎదుట చేనేత ధర్నా

తెనాలి: చేనేతల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 19వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాలని చేనేత నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక ప్రగడ కోటయ్య నగర్‌లోని కళ్యాణమండపంలో బుధవారం చేనేత కార్మికుల సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడారు. మానవ సమాజానికి నాగరికతను అందించిన చేనేత కళ నేడు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. చేనేతను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, చేనేతల 11 రకాల రిజర్వేషన్ చట్టాని అమలు చేయాలనీ, నూలు, చేనేత వస్త్రాలపై విధించిన జీఎస్టీని తక్షణమే రద్దు చేయాలని, నేతన్న నేస్తం పథకాన్ని షెడ్ మగ్గాల నేతన్నలకు, ఉపవృత్తుల కార్మికులకు వర్తింపజేయాలనే డిమాండ్లతో ఈనెల 19న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించి, స్పందన సమావేశంలో వినతిపత్రాలను సమర్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. చేనేత సంఘాల నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, గుర్రం చినవీరయ్య, రామనాథం పరమేశ్వరరావు, జొన్నాదుల నరసింహారావు, కాకుమాను ఫ్రాన్సిలు మాట్లాడారు. చేనేత కార్మికులు పోలిశెట్టి వెంకటేశ్వరరావు, జొన్నాదుల గోపి, గొర్రె శివశంకరరావు, రంగా వెంకటేశ్వరరావు, చింతక్రింది కోటిస్వామి, వుద్దంటి కృష్ణ, పానుగంటి శ్రీను పాల్గొన్నారు.

16న పెరియార్ సమకాలీనతపై సదస్సు



పెరియార్ సమకాలీనత సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మంగళగిరి: పెరియార్- సమకాలీనతపై సదస్సు ఈనెల 16వ తేదీ నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్- జాషువా- పూలే- పెరియార్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల విల్సన్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లోని విగ్రహం ఎదుట పెరియార్ – సమకాలీనత సదస్సు కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. విల్సన్ మాట్లాడుతూ హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన మందిరంలో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నేటి సమాజంలో పెరియార్ ఆలోచనలను ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. సదస్సులో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్‌తో పాటు పలువురు పత్రికా సంపాదకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కిన్నెర చంద్రశేఖర్, రమేష్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

చింతచెట్టుకు నిప్పు...

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామ శివారులో కర్నూలు- గుంటూరు రాష్ట్ర రహదారికి పక్కన పున్న చింతచెట్టుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. మంటలు పెద్దవిగా లేవడం చెట్టు సమీపంలో 11 కేవీ విద్యుత్ తీగలు ఉండటం గమనించిన స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన ఏఈ పుల్లారెడ్డి, సత్తెనపల్లి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే చెట్టు మొదలు భాగం దహనం కావడంతో పొక్లెయిన్‌తో చెట్టును రోడ్డు వైపునకు కూల్చి వేశారు. ఏఈ పుల్లారెడ్డి మాట్లాడుతూ చెట్టు పూర్తిగా దహనం కావడంతో తీగలపై కూలిపోయే పరిస్థితి ఏర్పండిందని స్థానికుల సమాచారంతో చెట్టును రోడ్డువైపునకు పడేలా చేశామన్నారు. ఆయన వెంట లైన్‌ఇన్‌స్పెక్టర్ శివకుమార్, లైన్‌మెన్లు అశోక్, అసిస్టెంట్ లైన్‌మెన్స్ చల్లా శ్రీనువాసరెడ్డి, ఇజ్రాయిల్, వెంకటేశ్వరరావు ఉన్నారు.